

ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న బీఆర్ఎస్ మహారాష్ట్ర ఇన్‌చార్జి కల్వకుంట్ల వంశీధర్‌రావు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 23 : పట్టణంలో మార్కండేయ ఆలయ 61వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఉత్సవాల్లో భాగంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. వేడుకల్లో బీఆర్ఎస్ మహారాష్ట్ర ఇన్‌చార్జి కల్వకుంట్ల వంశీధర్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం అధ్యక్షుడు రాజేశం, మల్లికార్జున్, ప్రభాకర్, శ్రీహరి, రవితేజ, యాదగిరి, బాలనారాయణ, రాజేశం పాల్గొన్నారు.

రథోత్సవంలో పాల్గొన్న సతీశ్‌కుమార్ తదితరులు

రథోత్సవంలో మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్, ఫిబ్రవరి 23 : హుజూరాబాద్ మండలం సింగాపూరంలో వేంకటేశ్వర స్వామి బ్రహోత్సవాలు వైభవంగా కొసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన రథోత్సవంలో హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్-షమిత దంపతులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవాల్లో బీఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకుడు వొడితెల ఇంద్రనీల్‌బాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామి ఆలయం (ఇన్‌సెట్లో రామలింగేశ్వరస్వామి మూల విరాట్)

నేటి నుంచి బెక్కల్ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 23: ఓరుగల్లును రాజధానిగా చేసుకొని పాలన సాగించిన కాకతీయ చక్రవర్తులు శైవ మతాన్ని పెంపొందించడంలో భాగంగా ఎన్నో శైవక్షేత్రాలను నిర్మించారు. అలాంటి శైవక్షేత్రాల్లో ప్రసిద్ధికెక్కిన పుణ్యక్షేత్రమే ధూళిమిట్ట మండలంలోని బెక్కంటి రామలింగేశ్వర ఆలయం. నేడు(శనివారం) ఉదయం 5 గంటలకు రామలింగేశ్వరస్వామి మేలుకొలుపు, 6 గంటలకు దిష్టికుంభం, పారునంది శంకర య్యశర్మ వైదిక నిర్వహణలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం 4 గంటలకు బండ్ల సేవా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈనెల 25, 26వ తేదీల్లో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, 27న అమ్మవారికి కుంకుమార్చనలు, అభిషేకాలు, 28న అభిషేకాలు, అర్చనలు, 29న గంగాస్నానం, స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మార్చి 8న మహాశివరాత్రి పురస్కరించుకొని లింగోద్భవ సమయంలో రామలింగేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, మల్లన్నకు పెద్ద పట్నం, బోనాలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

కనుల పండువగా పెద్దమ్మతల్లి కల్యాణోత్సవం

- భారీగా తరలివచ్చిన భక్తజనం
- కిటకిటలాడిన అనాజీపూర్

పెద్దమ్మ కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న పురోహితులు

రాయపోల్, ఫిబ్రవరి 23: మండలంలోని అనాజీపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి ఉత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వేదబ్రాహ్మణుల పండితుల మంత్రోచ్చారణలు మధ్య పెద్దమ్మతల్లి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గత 5 రోజుల నుంచి ఆలయం వద్ద ఉత్సవాలు కొనసాగుతున్నాయి. అనాజీపూర్‌తోపాటు రాయపోల్ మండలంలోని పరిసరాల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు గ్రామ ముదిరాజ్ సంఘం సభ్యులు బోనాలను గ్రామంలో ఊరేగించి పెద్దమ్మ తల్లికి సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో అనాజీపూర్ గ్రామం కిటకిటలాడింది. ఉత్సవాల్లో పురోహితులు పాలెం మనోహర శర్మ, నాగేశ్వశర్మ, వెంకటేశ్వశర్మ, గ్రామ ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రైతులపై 'బీజేపీ' దాష్టీకం సరికాదు

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు మల్లేశ్

హుస్నాబాద్, ఫిబ్రవరి 23: శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం దాష్టీకం సరికాదని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు మల్లేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. దేశ రాజధాని ఢిల్లీ సమీపంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆందోళనకు దిగిన రైతులపై పోలీసులు తూటాలు పేల్చ డం, టియర్‌గ్యాస్ ప్రయోగించడం బీజేపీ నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో రైతు శుభకరణ్‌సింగ్ మృతిచెందడం బాధాకరమన్నారు. కాల్పులకు తెగబడ్డ పోలీసులపై చర్యలు తీసుకోవాలని, మృతిచెందిన రైతు కుటుంబానికి రూ. కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతుల డిమాండ్లను పరిష్కరించి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.

రైతులపై కాల్పులు అప్రజాస్వామికం

బెజ్జంకి, ఫిబ్రవరి 23: పంటలకు కనీస మద్దుతు ధర కల్పించాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న పంజాబ్, హర్యాన రైతులపై కేంద్ర ప్రభుత్వం పోలీసుతో కాల్పులు జరిపించడం అప్రజాస్వామికమని సీపీఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులపై కాల్పులు జరిపిన పోలీసులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వానికి రైతులు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

రుణమాఫీ వెంటనే అమలు చేయాలి

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 23: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు, పంట రుణమాఫీని వెంటనే అమలు చేయాలని రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గడీల భైరవరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్దిపేటలో రైతు సంఘాలతో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తెలంగాణలో సమగ్ర భూసర్వే చేయించాలన్నారు. పొద్దుతిరుగుడు విత్తన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పొద్దుతిరుగుడు విత్తన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు వడ్డీలేని రుణాలు, సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందించాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు మహేందర్, రాజేందర్‌ప్రసాద్, ఈశ్వర్‌రెడ్డి, రంగారెడ్డి, ఎల్లారెడ్డి, వెంకటరెడ్డి, రాజయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

వనదేవతల జాతర్లలో భక్త జనహోరు

గద్దెకు చేరుకున్న సమ్మక్క-సారలమ్మ దేవతలు.. మొక్కులు చెల్లించుకున్న భక్తులు

- జాతరల్లో పోటెత్తిన భక్తజనం

హుస్నాబాద్, ఫిబ్రవరి 23 : వనదేవతలైన సమక్క-సారలమ్మ జాతర్లలో భక్తజనం హోరెత్తింది. బుధ, గురువారాల్లో వరుసగా సమక్క-సారలమ్మ గద్దెపైకి చేరుకోవడంతో శుక్రవారం ఇద్దరమ్మలను భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు సమీపంలో జరిగిన జాతరలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. పసుపు, కుంకుమ, బెల్లంప్రసాదం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి, హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామాల్లో జరుగుతున్న జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆయా జాతరల్లో వెలసిన దుకాణాలు కొనుగోళ్లతో కిటకిటలాడాయి. జాతరకు వచ్చిన భక్తులు దర్శనం అనంతరం అక్కడే వంటలు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు.

అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఉండాలి

హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 23 : సమ్మక్క-సారలమ్మ ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు వద్ద ఉన్న సమ్మక్క-సారలమ్మను మున్సిపల్ చైర్‌పర్సన్ దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, హుస్నాబాద్ మరింత అభివృద్ధి సాధించాలని అమ్మవార్లను కోరుకున్నట్లు తెలిపారు. ఆమె వెంట మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అనిత, మాజీఎంపీపీ ఆకుల వెంకట్, కౌన్సిలర్ పున్నలావణ్య, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు శంకర్‌రెడ్డి, ఎండీ అయూబ్, పూజారులు ఉన్నారు.

హుస్నాబాద్ టౌన్: బంగారంతో వస్తున్న చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న

మొక్కులు చెల్లించుకున్న భక్తులు

చేర్యాల, ఫిబ్రవరి 23: పట్టణ శివారు బురాన్‌మియా తోటలో సమ్మక్క-సారలమ్మ జాతర భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నది. అమ్మవార్లు గద్దెల పైకి రావడంతో భక్తులు వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. సమ్మక్క-సారలమ్మ జాతర కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని వసతులు కల్పించారు. నేడు సమ్మక్క-సారలమ్మ వన ప్రవేశం కార్యక్రమం జరుగనుంది.

కూటిగల్‌లో వనదేవతలకు మొక్కులు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 23: ధూళిమిట్ట మండలంలోని కూటిగల్ సమ్మక్క-సారలమ్మ జాతరలో భాగంగా అమ్మవార్లకు భక్తులు మొక్కులు చెల్లించారు. ఎత్తుబంగారం, ఎదురుకోళ్లతో వనదేవతలకు మొక్కులు సమర్పించారు. కోయపూజారులు అమ్మవార్లకు వారి సంప్రదాయం ప్రకారం పూజలు చేశారు. గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క-సారలమ్మను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో గద్దెల పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ ప్రత్యేకాధికారి రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి అనిత, జాతర కమిటీ చైర్మన్ కొండూరి శ్రీనివాస్ అన్ని ఏర్పాట్లు చేశారు.

వనదేవతలను దర్శించుకున్న భక్తులు

కొమురవెల్లి, ఫిబ్రవరి 23 : కొమురవెల్లి పాత కామన్ వద్ద కొలువుదీరిన సమ్మక్క-సారలమ్మను భక్తులు దర్శించుకొని మొక్కులు చెలించుకున్నారు. ఇద్దరు అమ్మవార్లు గద్దెనెక్కడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చిన భక్తులకు కొమురవెల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

జాతరకు పోటెత్తిన జనం

కోహెడ, ఫిబ్రవరి 23: మండలంలోని తంగల్లపల్లి, వింజపల్లి, పరివేద గ్రామాల్లో కొలువైన సమ్మక్క-సారలమ్మ జాతర్లకు భక్తులు పోటెత్తారు. వనదేవతలను భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కోహెడ ఎంపీపీ కీర్తి, జడ్పీటీసీ నాగరాజుశ్యామల తంగల్లపల్లిలో అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా సమ్మక్క-సారలమ్మ జాతర

గజ్వేల్ అర్బన్, ఫిబ్రవరి 23: గజ్వేల్ -ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మాపూర్‌లో సమ్మక్క-సారలమ్మ జాతర ఘనంగా జరిగింది. పూజారి పరశురాములు ఆధ్వర్యంలో అమ్మవార్లను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలో ప్రతిష్ఠించారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ స్వామి, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

మేడారం జాతరలో పోలీస్ ఔదార్యం

హుస్నాబాద్, ఫిబ్రవరి 23 : మేడారం జాతరలో విధులు నిర్వహిస్తున్న హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. హెడ్‌కానిస్టేబుల్ మొగిలినాయక్‌కు మేడారం జాతరలోని జంపన్న వాగు వద్ద డ్యూటీ పడింది. శుక్రవారం అక్కడ విధులు నిర్వహిస్తున్న సమయంలో రెండేండ్ల బాలుడు తప్పిపోయి ఏడుస్తూ కనిపించడు. వెంటనే స్పందించిన హెడ్‌కానిస్టేబుల్ తల్లిదండ్రుల ఆచూకీ తెలుసుకొని బాలుడిని అప్పగించారు. తప్పిపోయిన బాలుడిని నిమిషాల వ్యవధిలో తల్లిదండ్రులకు అప్పగించడంతో మొగిలినాయక్‌ను పోలీస్ అధికారులతోపాటు భక్తులు అభినందించారు.

మద్దూరు: కూటిగల్‌లో సమ్మక్క-సారలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

కొమురవెల్లి: సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద అన్నదానం చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ బదిలీ

- సిద్దిపేట కలెక్టర్‌గా మనుచౌదరి

నూతన కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 23 : సిద్దిపేట కలెక్టర్‌గా పని చేస్తున్న ప్రశాంత్ జీవన్ పాటిల్ బదిలీ అయ్యారు. సిద్దిపేట జిల్లా నూతన కలెక్టర్‌గా 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన మిక్కిలినేని మనుచౌదరి నియమితులయ్యారు. కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ నీటి పారుదలశాఖ ప్రత్యేక కార్యదర్శిగా నియామకం కాగా.. కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌గా పని చేస్తున్న మిక్కిలినేని మనుచౌదరి సిద్దిపేట కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండొద్దు

వర్గల్, ఫిబ్రవరి 23: ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వ్యవసాయరంగం, గృహ వినియోగానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండొద్దని విద్యుత్ డివిజనల్ ఇంజినీర్ ఆర్.భానుప్రకాశ్ అధికారులకు సూచించారు. శుక్రవారం గౌరారం సబ్‌స్టేషన్ కార్యాలయంలో ములుగు సబ్ డివిజన్ విద్యుత్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ, వ్యవసాయరంగానికి విద్యుత్ సరఫరా చేసేందుకు సబ్‌స్టేషన్ల వారీగా సిద్ధంగా ఉండాలని సూచించారు. విద్యుత్ వినియోగదారులకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. సమావేశంలో ఏడీఈ శ్రీనివాస్, ఏఈలు సంతోష్‌కుమార్, శ్రీనివాస్, సుధీర్, ఫీల్డ్ అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టవిరుద్ధం

గజ్వేల్, ఫిబ్రవరి 23 : బాల్య వివాహాలు చేయడం చట్ట విరుద్ధమని, అలా చేస్తే చర్యలు తప్పవని జిల్లా సంక్షేమాధికారిణి సావిత్రి హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని కొల్గూర్‌లో 13 ఏండ్ల బాలికకు వివాహం చేయడానికి తల్లిదండ్రులు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న అధికారులు గ్రామానికి చేరుకొని బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం బాలికను సిద్దిపేటలోని బాలికల సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఆమె వెంట సీడీపీవో వెంకటరాజమ్మ, అధికారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

హుస్నాబాద్, ఫిబ్రవరి 23: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన హుస్నాబాద్ పట్టణ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కోహెడ మండలం మైసంపల్లికి చెందిన వెంగళం అశోక్(50) హుస్నాబాద్ నుంచి సిద్దిపేట రోడ్డు మీదుగా తన గ్రామానికి టూవీలర్‌పై వెళ్తున్నాడు. హుస్నాబాద్ పట్టణ శివారులోని సిద్దిపేట రోడ్డు శ్రీచైతన్య స్కూల్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని అశోక్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి 100 డయల్ చేసి సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్థానిక సర్కారు దవాఖానకు తరలించారు. మృతుడి తరపున ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఎస్సై మహేశ్ తెలిపారు.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈవో సూర్యప్రకాశ్

- డీఐఈవో సూర్యప్రకాశ్

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 23 : ఈనెల 28 నుంచి ప్రారంభంకానున్న ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి సూర్యప్రకాశ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, కస్టోడియన్లు, అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్లతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 44 పరీక్షా కేంద్రాల్లో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 15 ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఉండగా.. మరో తొమ్మిది ప్రభుత్వ అనుబంధ కళాశాలలు ఉన్నాయని తెలిపారు. గతేడాది మాదిరిగానే నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబోమన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన విధివిధానాల గురించి ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లకు వివరించారు. సమావేశంలో డీఈసీ మెంబర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్‌లో సామాజిక తనిఖీలో మాట్లాడుతున్న అధికారులు

అవకతవకలకు పాల్పడితే చర్యలు

- డీఆర్డీవో అడిషనల్ పీడీ బాలకృష్ణ

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 23 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని డీఆర్డీవో అడిషనల్ పీడీ బాలకృష్ణ హెచ్చరించారు. శుక్రవారం మండల కార్యాలయం వద్ద ఈజీఎస్ 14వ విడుత సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని 29 గ్రామ పంచాయతీల్లో రూ.3.90 కోట్ల పనులు చేపట్టగా, ఆ పనులపై సామాజిక తనిఖీ చేపట్టారు. ఆయా గ్రామాల్లో జరిగిన పనుల వివరాలను డీఆర్డీలు గ్రామ సభలు నిర్వహించి పనుల చెల్లింపునకు సంబంధించిన నివేదికలను ప్రజాదర్బార్‌లో చదివి వినిపించారు. పలు గ్రామాల్లో సామాజిక తనిఖీల్లో వెలికితీసిన పొరపాట్లను పీడీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అడిషనల్ పీడీ మాట్లాడుతూ ఉపాధి జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ 100 రోజుల పని కల్పించాలన్నారు. చేసిన పనులకు సకాలంలో డబ్బులు చెల్లించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఉపాధి హామీ 7 రకాల రికార్డులతోపాటు హరితహారం, నర్సరీ రిజిస్టర్లు తప్పనిసరిగా మెయింటేయిన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్, విజిలెన్స్, అధికారి ప్రభాకర్, జూనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ సంతోష్, ఎంపీడీవో శ్రీనివాసవర్మ, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, మునిగడప ఎంపీటీసీ కిరణ్‌గౌడ్, ఏపీవో లక్ష్మి, టీఏలు తిరుపతిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రాజు, సీవోలు నాగరాజు, సంయోద్దీన్ పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, వేణు, ప్రత్యేకాధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేయండి

- అధికారులను వేడుకుంటున్న రైతులు
- రైతులపై అసహనం వ్యక్తం చేసిన అధికారులు
- ఆందోళనలో రైతన్నలు

మాట్లాడుతున్న రైతులు

చిన్నకోడూర్, ఫిబ్రవరి 23 : రంగనాయకసాగర్ ఎడమ కాల్వ నుంచి నీళ్లు వదిలి ఇరువై రోజులు గడుస్తున్నా బెల్లంకుంట చెరువుకు నీళ్లు రాక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మండల కేంద్రమైన చిన్నకోడూరు గ్రామానికి చెందిన రైతులు గ్రామంలోని బెల్లంకుంట చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పంటకు నీరు విడుదల చేయాలని అధికారులను కోరితే మాకు చెప్పకండి.. తమకు ఎలాంటి సంబంధం లేదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారన్నారు. అయ్యా ముఖ్యమంత్రి.. రైతుల కోసం అన్ని చేస్తా అన్నారు. పంటలు ఎండిపోతుంటే మీ అధికారులు ఏసీ రూముల్లో సేద తీరుతున్నారని, ఇదేనా మీ ప్రభుత్వం రైతులపై వ్యవహరించే తీరు అని ప్రశ్నించారు. రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లో పుష్కలంగా నీళ్లు ఉన్నప్పటికీ బెల్లంకుంట చెరువుకు సాగునీరు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బెల్లంకొండ చెరువుకు నీళ్లు విడుదల చేయాలని కోరారు. చెరువును పరిశీలించిన వారిలో రైతులు జంగిటి శ్రీనివాస్, రాజు, కనకయ్య, మల్లేశం తదితరులు ఉన్నారు.

చదువుకు పేదరికం అడ్డుకాదు

- అదనపు కలెక్టర్ గరీమాఅగర్వాల్

రాయపోల్, ఫిబ్రవరి 23: చదువుకు పేదరికం అడ్డుకాదని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు. విద్యార్థులు కష్టపడి టెన్త్‌లో పదశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. జిల్లా జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాయపోల్ మండలంలోని బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ పితామహుడు సీవీ రామన్ విగ్రహాన్ని ఆవిష్కరించి వివిధ స్టాళ్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పట్టుదల, క్రమశిక్షణతో ముందుకుసాగితే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేలా కృషిచేయాలన్నారు. బేగంపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు సైన్స్‌లో ముందున్నారని, వారి నైపుణ్యం వివిధ స్టాళ్లలో కనిపించిందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో నర్సమ్మ, ఎంపీడీవో బాలయ్య, ఎంపీటీసీ పిట్ల వెంకటయ్య, ప్రధానోపాధ్యాయుడు అంజిరెడ్డి, సీఆర్పీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

బేగంపేట పాఠశాలలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరీమాఅగర్వాల్

క్రీడాకారుల ఎంపిక

సిద్దిపేట, ఫిబ్రవరి 23: జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలను శుక్రవారం ఆచార్య జయశంకర్ స్టేడియంలో ఆ సంఘం అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్ జెండాఊపి ప్రారంభించారు. అండర్ -14, 16, 18, 20 విభాగాల్లో ఓపెన్ కేటగిరీలో క్రీడాకారులను ఎంపిక చేశారు. కొత్తగూడెంలో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించిన జితేశ్‌ను సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25న హైదరాబాద్‌లోని కొల్లూరు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన క్రీడాకారులు అక్షిత, జడ్పీహెచ్ఎస్ రామంచ, విశాల్, శ్రీవాణి స్కూల్, అక్షయ్ అంకిరెడ్డిపల్లి, గణేశ్, జడ్పీహెచ్ఎస్ చిన్నకోడూరు, లక్ష్మణ్, జడ్పీహెచ్ఎస్ చిన్నకోడూరు, బిందు, శ్రీవాణి స్కూల్, అజయ్, సహస్రా స్కూల్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి పన్యాల రామేశ్వర్‌రెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కర్రోళ్ల వెంకటస్వామిగౌడ్, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కడకంచి ఉప్పలయ్య, గ్యాదరి కుమార్, క్రికెట్ కోచ్ విజయ్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 23: రాబోయే పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈవో ఉదయభాస్కర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ రాజన్న సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగదేవ్‌పూర్, మర్కుక్, తుర్కపల్లి మ